క్లుప్తంగా

నేటి నుంచి కొవ్వూరులో అన్న క్యాంటీన్

కొవ్వూరు: పేదలు, బడుగు బలహీన వర్గాల ఆకలి తీర్చేందుకు కొవ్వూరులో ఆదివారం నుంచి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్టు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి శనివారం ప్రకటించారు. ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించేంత వరకూ నియోజకవర్గ టీడీపీ తరపున నాయకుల సొంత ఖర్చులతో అన్న క్యాంటీన్‌ను నడుపుతామన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి రూ.5కే భోజనం అందిస్తామన్నారు. ఇప్పటికే అన్న క్యాంటీన్ భవనానికి రంగులు వేయించి సుందరంగా తయారు చేశారు. ఇప్పటి వరకూ ఈ భవనంలో నిర్వహించిన మెప్మా కార్యాలయాన్ని మునిసిపల్ కార్యాలయంలోకి మార్చారు.మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, టీడీపీ నాయకులు పొత్రు శ్రీనివాస్, దాయిన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం


యువకుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల దుర్గేష్

నిడదవోలు: విద్యుతాఘాతంతో మృతి చెందిన రావిమెట్ల గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త హరీష్ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే కందుల దుర్గేష్ పరామర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద హరీష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జనసేన పార్టీ తరపున, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పట్టణ శాఖల అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్కొండపాడులో అమ్మవారి గ్రామోత్సవం

చాగల్లు: మార్కొండపాడు గ్రామదేవత ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్ల జాతర మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం నడివీధిలోని పూరిపాక వద్ద అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించి పానకం, చలివిడితో పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల ముఖ ద్వారాలతో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలంకరణ ఆకట్టుకుంది. సేవ సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, ఆసాదుల నృత్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్, గరగ నృత్యాలతో పాటు భారీ ఎత్తున బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారిని ఊరేగించారు. జాతరకు బంధువులు, స్నేహితుల రాకతో మార్కొండపాడు గ్రామం కళకళలాడింది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు


వైభవంగా జరుగుతున్న స్వామివారి ఊరేగింపు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్దగల గోవిందక్షేత్రంలోని స్వామివారి ఉత్సవమూర్తిని శనివారం ఘనంగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోవింద క్షేత్రం 14వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం విష్ణు సహస్రనామ పారాయణ, తిరువీధి ఉత్సవం, గరుడ సేవ జరిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మట్టపల్లి రంగప్రసాద్, మట్టపల్లి రామ్‌కుమార్, సురేష్ కుమార్, బలభద్ర వెంకటరాజు, లక్ష్మణస్వామి, ఆలయ అర్చకులు శ్రీమన్నారాయణ, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

నిమ్మ రైతుకు లాభాల సిరులు

- ఎకరాకు 80 బస్తాల దిగుబడి
- రూ.లక్ష నికర ఆదాయం
- మార్కెట్లో గిట్టుబాటు ధర
- రోజుకు 50 టన్నుల కాయల ఎగుమతి


దేవరపల్లి మండలం యాదవోలులో సాగు చేస్తున్న నిమ్మతోట

దేవరపల్లి: నిమ్మ సాగుదారులకు లాభాల పంట పండింది. మూడేళ్లుగా గిట్టుబాటు ధర లభిస్తుండడంతో నిమ్మకాయల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు సుమారు రూ.80 వేల నుంచి రూ.1 లక్ష వరకూ ఆదాయం పొందుతున్నారు. 2022 వ సంవత్సరం మార్కెట్లో కిలో కాయల రేటు రూ.150 నుంచి రూ.170 వరకూ పలికింది. అయితే ఈ ఏడాది దిగుబడులు చెప్పుకోదగిన లేకపోవడంతో రైతులకు అంతంత మాత్రం లాభాలే వచ్చాయి. ఆ ఏడాది ఎకరాకు 40 నుంచి 50 బస్తాల (బస్తాకు 50 కిలోలు) దిగుబడి వచ్చింది. 2023 సీజన్‌లో కిలో నిమ్మకాయలు రూ.60 నుంచి రూ.80 వరకూ ధర పలికినప్పటికీ దిగుబడులు తగ్గాయి. మార్కెట్లో మంచి ధరలు పలకడంతో రైతులు లాభాలతో ఒడ్డెక్కారు. ఇక 2024 సీజన్‌లో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 80 నుంచి 100 బస్తాల దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. కిలో కాయలకు రూ.70 రేటు లభించింది. ఈ ఏడాడి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ధర నిలకడగా కొనసాగడంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. జూన్‌లో ఈ ధర రూ.30 నుంచి రూ.40 వరకూ పడిపోతుందని రైతులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ఇబ్బంది లేదని వారు భావిస్తున్నారు. ఎందుకంటే సాధారణంగా జూన్‌లో కిలో నిమ్మకాయల ధర రూ.10 మాత్రమే పలుకుతుందని, అయినప్పటికీ కొనే నాథుడు ఉండడని పేర్కొంటున్నారు.

కౌలు రైతులు ఖుషీ

నిమ్మ మార్కెట్ ఈ ఏడాది ఆదుకోవడంతో కౌలు రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ నిమ్మకాయలకు మంచి సీజన్ ఉంటుంది. నిమ్మ ఏడాదికి మూడు పంటల దిగుబడి వస్తుంది. అయితే వేసవి మూడు నెలలూ వచ్చిన దిగుబడే రైతులను ఆదుకొంటుంది. మిగిలిన కాలంలో వచ్చిన నిమ్మ దిగుబడికి మార్కెట్లో ధర అంతంత మాత్రంగానే ఉంటుంది. ఒకొక్క సమయంలో కాయల కోత కూలి కూడా రావడం కష్టమవుతుంది.

ఎగుమతి కేంద్రంగా యాదవోలు

నిమ్మకాయల ఎగుమతి కేంద్రంగా దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్ గుర్తింపు పొందింది. రాష్ట్రంలోని గూడూరు, ఏలూరు మార్కెట్ల తర్వాత యాదవోలు మార్కెట్ నిమ్మకాయల ఎగుమతికి ప్రసిద్ధి. యాదవోలు నిమ్మ మార్కెట్ ఏర్పడి దాదాపు 25 ఏళ్లు అవుతోందని రైతులు తెలిపారు. అప్పటి నుంచి ఇక్కడ కొనుగోలు చేసిన నిమ్మకాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. పంట పండించే రైతు కుటుంబాల నుంచి కొందరు యువకులు కమిటీగా ఏర్పడి రైతుల నుంచి రోజూ కాయలు కొనుగోలు చేస్తారు. వాటిని ఎప్పటికప్పుడు కోల్‌కత్తా, ఢిల్లీ, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం, రావులపాలెం, గాజువాక, విశాఖపట్నం, కాకినాడ, ఇచ్ఛాపురం, టెక్కలి, ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఆ యువత ఈ మార్కెట్లో రైతుల నుంచి ఎలాంటి కమీషన్ తీసుకోకుండానే నిమ్మకాయలను కొనుగోలు చేస్తారు. రైతులే ఎగుమతి దారులు కావడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తోంది.

20 గ్రామాల రైతులకు మేలు

యాదవోలు పరిసర గ్రామాల నుంచి రోజూ రైతులు తాము పండించిన పంటను యాదవోలు మార్కెట్‌కు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటున్నారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మార్కెట్ జరుగుతుంది. రోజుకు 50 నుంచి 80 టన్నుల నిమ్మకాయలు కొనుగోలు చేస్తారు. సీజన్లో రోజుకు 80 టన్నుల కాయల విక్రయాలు జరుగుతుండగా, ప్రస్తుతం 50 టన్నుల కాయలు కొనుగోలు చేస్తున్నారు. కిలో కాయల ధర రూ. 30 నుంచి రూ. 40 పలుకుతున్నాయి. చుట్టుపక్కల 70 కిలో మీటర్ల దూరం నుంచి సుమారు 20 గ్రామాల రైతులు కాయలను తీసుకు వచ్చి విక్రయిస్తారు.


దేవరపల్లి మండలం యాదవోలు మార్కెట్లో కొనుగోలు చేసిన నిమ్మకాయలు

దిగుబడులు ఆశాజనకం



నిమ్మకాయల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 80 నుంచి 100 బస్తాల దిగుబడులు వచ్చాయి. మంచి డిమాండ్ కూడా ఉండడంతో రైతులకు ఎకరాకు రూ.1లక్ష నికర ఆదాయం వచ్చింది. కౌలు రైతులకు రూ.50 నుంచి 60 వేలు ఆదాయం వచ్చింది. సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తున్నాయి. దీనివల్ల చెట్టు తెగుళ్లను తట్టుకుంటుంది. చెట్టు మొదట నవధాన్యాల విత్తనాలు వేసుకుంటే చెట్టుకు బలం చేకూరుతుంది. నేను రెండెకరాల్లో సేంద్రియ పద్ధతిలో నిమ్మపంట సాగు చేస్తున్నాను.

– సింగులూరి రామ్మోహనరావు,
రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

నిమ్మ లాభాల పంట



నిమ్మ పంట లాభసాటిగా ఉంది. ఈ ఏడాది దిగుబడులు, మార్కెట్లో ధర ఆశాజనకంగా ఉండడం వల్ల లాభాలు వచ్చాయి. మూడు నెలల కిలో కాయలు రూ.60 నుంచి రూ. 70 నిలకడగా ధర ఉంది. ఎకరాకు సాధారణంగా 100 నుంచి 120 బస్తాల దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది 80 నుంచి 100 బస్తాలు దిగుబడి వచ్చాయి. జూన్ నెలలో కూడా మంచి మార్కెట్ నడుస్తోంది. నిమ్మపంట సాగులో యాదవోలుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. ఇక్కడ రైతులు మోసపోయే పరిస్థితి లేదు. రైతు మార్కెట్ నడుస్తోంది. ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారు. వారు కూడా ఆర్థికంగా నిలదొక్కున్నారు. గ్రామంలో సుమారు 400 మంది రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు.

– అనిశెట్టి సూర్యచంద్రం,
రైతు, యాదవోలు, దేవరపల్లి మండలం

హింసాత్మక చర్యలు మానుకోవాలి


వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కిరణ్‌కుమార్

గోపాలపురం: ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అటువంటి దుశ్చర్యలను మానుకోవాలని అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు దాసరి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక చెక్ పోస్టు సెంటర్ వద్ద గల దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీల కోసం పని చేయడం తప్పు కాదన్నారు. అయితే ఎన్నికలు ముగిశాక కూడా కక్ష సాధింపులు, వేధింపులకు పాల్పడడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగుతున్న మారణకాండ నిలుపుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు.

డిగ్రీ కళాశాలలో 18 నుంచి అడ్మిషన్లు

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 18 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తెలిపారు. బీఏ హానర్స్‌లో స్పెషల్ తెలుగు, ఎకనామిక్స్, పాలిటిక్స్, బీఎస్సీ హానర్స్‌లో మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మున్సిపల్ చైర్మన్ భూపతికి సత్కారం


మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణను సత్కరిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బహుదా

నిడదవోలు: విజయవాడలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రోటరీ అంతర్జాతీయ సమావేశంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ –3020 గవర్నర్ బహుదాతో పాటు పలువురు రోటరీ సభ్యులు నిడదవోలు మున్సిపల్ చైర్మన్, సీనియర్ రొటేరియన్ భూపతి ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. రోటరీ ఇంటర్నేషనల్ సంస్థకు ఆదినారాయణ రూ.8.30 లక్షల విరాళంగా ఇచ్చి మేజర్ డోనర్ గౌరవం పొందిన సందర్భంగా ఆయనను సన్మానించారు. రోటరీ సంస్థకు భారీ మొత్తంలో విరాళం అందించిన ఆదినారాయణను పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ వారిచే మేజర్ డోనర్‌గా గుర్తించబడి, గౌరవించబడిన భూపతి ఆదినారాయణ సేవలతో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ గౌరవ ప్రతిష్టలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయన్నారు. కార్యక్రమంలో పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యంశర్మ, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలోనే బస్టాండ్ ప్రారంభం


బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జెడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు

నల్లజర్ల: స్థానిక కూడలిలోని తాడేపల్లిగూడెం రోడ్డులో కొన్నేళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. గత టీడీపీ హయాంలో నిర్మించిన ఈ బస్టాండ్‌ను ప్రారంభించకుండా అలాగే ఉంచేయడంతో కొందరు ఆకతాయిలు పాడు చేశారని వారన్నారు. వాటికి మరమ్మతులు చేసి సీఎంగా చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకారం తర్వాత అంగరంగ వైభవంగా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి వారు సంతాపం తెలిపారు. వారి వెంట టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సొసైటీ మాజీ చైర్మన్ అల్లాడ రాజారావు తదితరులు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి


కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని శనివారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వాదం ఇవ్వగా, ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్, సభ్యులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందజేస్తానని తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో కొవ్వూరు ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని భారీ మెజార్టీతో విజయం సాధించినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమం, కొవ్వూరు నియోజకవర్గాభివృద్ధికి ఎల్ల వేళలా పని చేస్తానన్నారు. గోపాలపురం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావును సత్కరించారు.

గోపవరంలో వన మహోత్సవం


గోపవరంలో మొక్క నాటుతున్న సర్పంచ్ శేఖర్‌బాబు

గోపాలపురం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మండలంలోని గోపవరం సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అన్నారు. అమృత్ సరోవర్‌లో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మండలంలోని గోపవరం గ్రామంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రామంలోని ఖాళీ ప్రదేశాలు, పొలం గట్లపై మొక్కలు పెంపకాన్ని చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ పథకం ఏపీఓ జె. రమణ సూచించారు.

ఆలయ భూముల కౌలు హక్కుల ఖరారు

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని వేగి లింగేశ్వర స్వామి, మదన గోపాలస్వామి, ధర్మతోపు దేవస్థానాల భూముల మూడేళ్ల కౌలు హక్కుల కోసం అధికారులు శనివారం వేలం నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిరాల శరణ్య, ఇన్‌స్పెక్టర్ సృజన్ ఆధ్వర్యంలో ఈ వేలం జరిగింది. వేగిలింగేశ్వర స్వామి ఆలయ భూమి 6.50 ఎకరాల కౌలు హక్కులను గురుమిల్లి బలరాముడు అనే రైతు ఏడాదికి రూ.1.30 లక్షలకు పాడుకున్నాడు. మదన గోపాల స్వామి ఆలయ భూమి 7.50 ఎకరాల కౌలు హక్కులను ఏడాదికి రూ.1.30 లక్షలకు విప్పిలి విశ్వేశ్వరరావు అనే రైతు దక్కించుకున్నాడు. ఇక ధర్మతోపు దేవస్థానం భూమి 4 ఎకరాల 50 సెంట్ల కౌలు హక్కులను ఏడాదికి రూ.40 వేలకు మద్దిపాటి రత్నాజీ దక్కించుకున్నాడు. అలాగే పోతవరం గ్రామంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ భూముల్లోని 7 ఎకరాల కౌలు హక్కులను గతంలో ఏడాదికి రూ.1.51 లక్షలకు పాడుకోగా, కాగా ఈ ఏడాది రూ.4.05 లక్షలకు అల్లూరి రాము అనే రైతు దక్కించుకున్నాడు. మరో 6.84 ఎకరాల భూమి కౌలు హక్కులు గతంలో ఏడాదికి రూ.2.17లక్షలకు ఖరారు కాగా, అదే భూమిని ఇపుడు రూ.2.51 లక్షలకు కొండేటి సత్యనారాయణ దక్కించుకున్నారు.

సొసైటీల చైర్‌పర్సన్ల రాజీనామా


దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా లేఖను సీఈఓకు అందజేస్తున్న కవల శ్రీనివాస్

- సీఈఓలకు అందజేసిన లేఖలు
- డీఆర్‌కు పంపించిన సీఈఓలు

దేవరపల్లి: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో సొసైటీల త్రిసభ్య కమిటీల చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. వారు తమ రాజీనామా లేఖలను సొసైటీల సీఈఓలకు అందజేసి ఆమోదించాలని కోరారు. మండలంలోని ఏడు సొసైటీల చైర్‌పర్సన్లు, 14 మంది డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. శుక్రవారం రాత్రి చిన్నాయగూడెం సొసైటీ చైర్‌పర్సన్ గడా జగదీష్ రాజీనామా చేయగా, మిగిలిన ఆరు సొసైటీల చైర్‌పర్సన్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను కొవ్వూరు డివిజన్ సహకార అధికారి వి.కృష్ణకాంత్‌కు పంపిస్తామని సీఈఓలు తెలిపారు. 2019 ఆగస్టు 3న ప్రభుత్వం సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించింది. వారిలో ఒకరిని పర్సన్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గాను, ఇద్దరిని డైరెక్టర్లుగా నియమించింది. అప్పటి నుంచి సొసైటీలు త్రిసభ్య కమిటీల సారథ్యంలో కొనసాగుతూ వచ్చాయి. మండలంలోని దేవరపల్లి, గౌరీపట్నం, కురుకూరు, చిన్నాయగూడెం, దుద్దుకూరు, యర్నగూడెం, త్యాజంపూడి సొసైటీలకు చైర్‌పర్సన్లుగా కవల శ్రీనివాస్, గుత్తికొండ అచ్యుతరావు, కూచిపూడి సతీష్, గడా జగదీష్, కాండ్రు రామకృష్ణ, నరహరిశెట్టి వైదేహి, కాకర్ల శోభన్‌కుమార్ చైర్‌పర్సన్లుగా విధులు నిర్వహించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ రుణాలు సకాలంలో అందజేసి వారి మన్ననలు పొందారు. సొసైటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేశారు. దాదాపు 70 నెలలు తమకు సహకరించిన అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలకు చైర్‌పర్సన్లు కృతజ్ఞతలు తెలిపారు.


కొవ్వూరులో శ్రీ రామా సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ శ్రీనివాస రవీంద్రను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీరామా సొసైటీ త్రీమెన్ కమిటీ రాజీనామా

కొవ్వూరు: పట్టణంలోని శ్రీరామా సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సభ్యులు గోశాల శ్రీనివాస్, బోడపాటి హనుమంతరావు శనివారం తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రభుత్వం నుంచి జీవో విడుదల కావడంతో తాము రాజీనామా చేసినట్టు శ్రీనివాస రవీంద్ర తెలిపారు. వాస్తవంగా వీరి పదవీ కాలం ఈ ఏడాది జూలై 31 వరకూ ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గత ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల నుంచి తప్పుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కావడంతో వారు రాజీనామాలు సమర్పించింది. ఈ సందర్భంగా త్రీమెన్ కమిటీ చైర్మన్ శ్రీనివాస రవీంద్ర, డైరెక్టర్లు శ్రీనివాస్, హనుమంతరావులను సొసైటీ కార్యదర్శి బొర్రా రాధాకృష్ణ, సిబ్బంది శాలువాలు కప్పి సత్కరించి వీడ్కోలు పలికారు.

చిటికెలో పేమెంట్

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు ఆదరణ


కిరాణా షాపులో కనిపిస్తున్న స్కానర్

సీటీఆర్ఐ: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందుకు జేబులో డబ్బులు పెట్టుకుని వచ్చేవాళ్లం. బయట పనులపై తిరగడానికి ఎంత అవసరమవుతుందో ముందే అంచనా వేసుకుని తీసుకువచ్చేవాళ్లం. కానీ ఇప్పుడు కాలం మారింది. అంతా డిజిటల్‌మయంగా మారింది. జేబులో రూపాయి లేకపోయినా స్మార్ట్‌ఫోన్, మన ఖాతాలో డబ్బులు ఉంటే చాలు. దానితోనే ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువులు కొనాలన్నా, నచ్చిన ఫుడ్ తిన్నాలన్నా, డబ్బులు పంపాలన్నా, మనం తీసుకోవాలన్నా అంతా చిటికెలో అయిపోతుంది. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాలు పెట్టే చిరు వ్యాపారులు చెంతకూ వచ్చేశాయి. పట్టణాలతో పాటు గ్రామాలకు విస్తరించాయి. డిజిటల్ లావాదేవీలకు అవసరమైన స్కానర్ లేకుండా ఏ వ్యాపారినీ చూడలేము.

కోవిడ్ అనంతరం మార్పులు

దేశంలో 2016లో పెద్దనోట్ల రద్దు జరిగింది. ఆ తర్వాత ఆర్థిక లావాదేవీలలో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కానీ అవి పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటిజాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలతో గణనీయమైన మార్పులు వచ్చాయి.

చిరు వ్యాపారులకు చెంతకు..

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిల్‌పై విక్రయాలు చేసే వారందరూ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రోత్సహిస్తున్నారు. వీటి వల్ల ప్రధానంగా చిల్లర సమస్య ఉండడం లేదు. డిజిటల్ పేమెంట్లతో చిల్లర సమస్యకు పరిష్కారం లభించింది. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి.

అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులే..

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్‌పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జ్‌లు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకూ ఈ యాప్‌ల నుంచి జరుగుతున్నాయి.

డిజిటల్ బ్యాంకింగ్

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరకులను కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుకే అమౌంట్ పే చేసినట్టు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారుఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్టు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.